క్లుప్తంగా

ఘనంగా పల్లాంబిక అమ్మవారి తీర్థం



విశేష అలంకరణలో పల్లాంబిక అమ్మవారు

కపిలేశ్వరపురం: కోరుమిల్లిలో కొలువైన పల్లాంబిక అమ్మవారి తీర్థం మంగళవారం ఘనంగా నిర్వహించారు. పెద్ద కోరుమిల్లిలోని మహాలక్ష్మి అమ్మవారి ఆలయం నుంచి చిన కోరుమిల్లిలోకి ఊరేగింపు జరిపారు. అమ్మవారికి పాన్పు వేశారు. విశేషంగా అలంకరించి ప్రత్యేక పూజలు చేశారు. గ్రామానికి చెందిన ఆడపడుచులు మొక్కులు తీర్చుకొన్నారు.

తడిసిన, రంగు మారిన ధాన్యాన్ని కొనుగోలు చేయాలి



ధాన్యం కొనుగోలు చేయాలని డిమాండ్ చేస్తున్న రాజబాబు తదితరులు

కాజులూరు: భారీ వర్షాల కారణంగా నీట తడిసిన, రంగుమారిన ధాన్యానికి ప్రభుత్వం మద్దతు ధరకు కొనుగోలు చేయాలని ఆంధ్రప్రదేశ్ కౌలు రైతు సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి వల్లు రాజబాబు అన్నారు. మంగళవారం మండలంలోని తిప్పరాజుపాలెం, పెనుమళ్ళ, జగన్నాథగిరి, తర్లంపూడి తదితర గ్రామాల్లో రాజబాబు తదితర నాయకులు పర్యటించి వర్షాలకు నీట తడిసిన వరి పొలాలను, ధాన్యం రాశులను పరిశీలించారు. పెనుమళ్ళలో ఆయన మాట్లాడుతూ నీట తడిసిన, ధాన్యాన్ని రైసుమిల్లర్లు రూ.150 నుంచి 200 వరకూ తగ్గించి కొనుగోలు చేస్తున్నారన్నారు. రైతు సేవాకేంద్రాల ద్వారా జరిగే ప్రభుత్వ కొనుగోలు కేంద్రాల్లో జట్టీలు లేకపోవటంతో మిల్లర్లు దళారుల ద్వారా తక్కువ ధరకు ధాన్యం పట్టుకుపోవాలని చూస్తున్నారన్నారు. నీట తడిసిన, రంగుమారిన ధాన్యానికి ప్రభుత్వం మద్దతు ధరకు కొనుగోలు చేయాలని రైతులతో కలసి డిమాండ్ చేశారు.

సమ్మె నోటీసు అందజేత



మండపేట మున్సిపల్ కమిషనర్‌కు సమ్మె నోటీసు అందజేస్తున్న సంఘం నాయకులు

కపిలేశ్వరపురం (మండపేట): తమ డిమాండ్లను పరిష్కరించాలని కోరుతూ మండపేట మున్సిపల్ ఇంజినీరింగ్ ఉద్యోగుల సంఘం నాయకులు మంగళవారం కమిషనర్ టీవీ రంగారావుకు సమ్మె నోటీసును అందజేశారు. మున్సిపాలిటీ ఇంజినీరింగ్ విభాగం ఔట్ సోర్సింగ్ ఉద్యోగుల సంఘం నాయకుడు పాలపర్తి సుబ్బరాజు మాట్లాడుతూ సంఘం రాష్ట్ర కమిటీ పిలుపు మేరకు సమ్మె నోటీసు అందజేశామన్నారు. గత 25 ఏళ్ల నుంచి విశేష సేవలందిస్తున్నప్పటికీ ఉద్యోగ భద్రత కరువైందన్నారు. తమ వేతనాలను పెంచాలని, 15 సంవత్సరాల పైబడి సర్వీసు కలిగిన కార్మికులను క్రమబద్ధీకరించడంతో పాటు నిర్దేశించిన 69 పండగ రోజులను సెలవుదినాలుగా ప్రకటించాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వం తమ డిమాండ్లను పరిష్కరించకపోతే సమ్మెకు ఉపక్రమిస్తామని సంఘం నాయకులు తెలిపారు.

మెగా జాబ్ మేళాతో మేలు

రాజోలు: మెగా జాబ్ మేళాతో నిరుద్యోగులకు ఎంతో మేలు జరుగుతుందని అమలాపురం ఎంపీ హరీష్ మాథుర్ అన్నారు. మంగళవారం రాజోలు ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో జిల్లా వికాస, రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంస్థ, ఏ1 సేవా సమితి సంయుక్తంగా ఏర్పాటు చేసిన మెగా జాబ్ మేళాను ఎంపీ హరీష్ మాథూర్, రాజోలు ఎమ్మెల్యే దేవ వరప్రసాద్‌లు ప్రారంభించారు. మెగా జాబ్‌మేళాలో 423 మందికి వివిధ కంపెనీల్లో ఉద్యోగాలు లభించాయి.

మండపేట మున్సిపల్ అధికారులు

కమిషనర్	9849905809
మేనేజర్	9849908186
డీఈ	9849769340
ఏఈ	9849906527
ఆర్వో	9849743832
ఆర్ఐ	7702155588
టీపీవో	9849986208
ఇన్‌చార్జ్ శానిటరీ ఇన్‌స్పెక్టర్, హెల్త్ అసిస్టెంట్	9849986209
ప్రభుత్వ ఆసుపత్రి సూపరింటెండెంట్	9849639629
జేడీ పశు సంవర్ధక శాఖ	8985488562
హౌసింగ్ డీఈ	7093930423
హౌసింగ్ ఏఈ టౌన్	7093930491
రూరల్ సీఐ, టౌన్ ఇన్‌చార్జ్	9440796537
టౌన్ ఎస్సై	8332957926
లేబర్ ఆఫీసర్	9492555059
ఫైర్ ఆఫీసర్	9963727741
ఇన్‌చార్జ్ ఆర్టీవో	9154294653
పోస్టుమాస్టర్	08855231890
ఎక్సైజ్ సీఐ	9440902412
సబ్ రిజిస్ట్రారు	7093921407

ఈ-శ్రమ్‌తో లాభాలెన్నో..

- జూన్ నెలాఖరు వరకు నమోదుకు అవకాశం
- పోర్టల్‌పై అవగాహన పెంచాల్సిన అవసరం



ఈ-శ్రమ్ కార్డు నమోదు చేస్తున్న కార్మిక శాఖ అధికారులు

రాయవరం: కేంద్ర ప్రభుత్వం అసంఘటిత, వలస కార్మికులకు సామాజిక భద్రతను దృష్టిలో ఉంచుకుని ఈ-శ్రమ్ పథకాన్ని ప్రవేశపెట్టింది. అయితే ఈ పథకానికి గ్రామస్థాయిలో అధికారులకు ఆశించినంతగా స్పందన కానరావడం లేదు. ఈ-శ్రమ్ పథకంలో అసంఘటిత రంగ కార్మికులకు ప్రయోజనం కల్పించేందుకు అధికారులు అవగాహన సమావేశాలు ఏర్పాటు చేస్తున్నారు. ఈ-శ్రమ్ పోర్టల్‌పై అవగాహన లేక పలువురు కార్మికులకు వారికి అందాల్సిన లబ్ధికి దూరమవుతున్నారని అధికారులు చెబుతున్నారు. క్లస్టర్ పరిధిలోని మండపేట, రామచంద్రపురం నియోజకవర్గాల పరిధిలోని మండపేట, రామచంద్రపురం మున్సిపాలిటీలతో పాటుగా మండపేట, కపిలేశ్వరపురం, రాయవరం, రామచంద్రపురం, కె.గంగవరం మండలాల్లో ఈ-శ్రమ్ నమోదుకు అధికారులు అవగాహన సమావేశాలు ఏర్పాటు చేస్తున్నారు. క్లస్టర్ పరిధిలో సుమారుగా రెండు లక్షల మందిని పథకం పరిధిలోకి తీసుకురావడం లక్ష్యం కాగా ఇప్పటి వరకు 50 శాతం మేర మాత్రమే నమోదైనట్లుగా అధికారులు చెబుతున్నారు.

60 సంవత్సరాల లోపు వారు అర్హులు

16 నుంచి 59 సంవత్సరాల మధ్య వయస్సు ఉన్న అసంఘటిత రంగ కార్మికులు, ఈపీఎఫ్ సభ్యత్వం లేని వారు, ఆదాయం పన్ను పరిధిలోకి రాని వారు ఈ-శ్రమ్ పథకానికి అర్హులు. ఈ పథకంలో నమోదైన వారు వివిధ సంక్షేమ పథకాలు వర్తిస్తాయి. ఈఎస్ఐ, పీఎఫ్ చెల్లించని వారు కూడా ఈ పథకానికి అర్హులు.

ఉపాధి హామీ కూలీలు, మత్స్యకారులు, భవన నిర్మాణ, పారిశుధ్య కార్మికులు, ఆశా, అంగన్‌వాడీ కార్యకర్తలు, స్వయం సహాయక సంఘాల మహిళలు, మధ్యాహ్న భోజన పథకం నిర్వాహకులు, వ్యవసాయ, ఉద్యాన, పాడి పరిశ్రమ కూలీలు, కుమ్మరి, స్వర్ణకారులు, ఇతర చేతి వత్తుల వారు, వాహన చోదకులు, వీధి వ్యాపారులు, సేవా రంగంలో ఉన్న వారు, వివిధ దుకాణాలు, సంస్థల్లో పనిచేస్తున్న వారు ఈ పథకం ద్వారా ప్రయోజనం పొందేందుకు అర్హులు.

రెండు రకాల ప్రయోజనాలు

ఈ-శ్రమ్ పథకంలో నమోదు చేయించుకున్న కార్మికులకు రెండు రకాల ప్రయోజనాలు వర్తిస్తాయి. ప్రమాదవశాత్తూ మరణం సంభవిస్తే రూ.2 లక్షలు ఆర్థిక సహాయాన్ని అందిస్తారు. ప్రమాదంలో అంగవైకల్యం ఏర్పడితే వైకల్య శాతాన్ని బట్టి రూ.లక్ష వరకు ఆర్థిక సాయాన్ని అందజేస్తారు. కార్మికుల భద్రత కోసం సుప్రీంకోర్టు ఇచ్చిన ఆదేశాలతో కేంద్ర ప్రభుత్వం ఈ-శ్రమ్ పథకంలో కార్మికుల పేర్లు నమోదు ప్రక్రియను ప్రారంభించారు. వలస కార్మికులు ఎవరైనా ఎక్కడైనా ఈ-శ్రమ్ కార్డు నమోదు చేయించుకోవచ్చు. ప్రాంతంతో సంబంధం లేకుండా నమోదు చేయించుకోవచ్చు. ఆధార్‌కార్డు, బ్యాంకు పాస్‌బుక్, ఆధార్‌కు అనుసంధానించిన సెల్ నంబర్ దగ్గర ఉంచుకుంటే నమోదు చేయించుకోవచ్చు. నామినీ ఆధార్ కార్డు కూడా లబ్ధిదారుడు దగ్గర ఉంచుకుని, వివరాలు నమోదు చేయించుకోవాలి. ఈ-శ్రమ్‌లో పేరు నమోదుకు ఎటువంటి రుసుం చెల్లించనవసరం లేదు. ఆధార్‌కార్డు, బ్యాంకు ఖాతా పుస్తకం జెరాక్స్, ఆధార్‌కు అనుసంధానమైన ఫోన్ నంబర్, నామినీ ఆధార్ వివరాలు అవసరమవుతాయి. సమీప గ్రామ, వార్డు సచివాలయాలు, కామన్ సర్వీస్ సెంటర్(సీఎస్‌సీ) లేదా కార్మిక శాఖ కార్యాలయాల్లో సంప్రదిస్తే ఆన్‌లైన్‌లో నమోదు చేస్తారు. నమోదు పూర్తయిన అనంతరం యూఏఎ నంబర్‌తో గుర్తింపు కార్డు జారీ అవుతుంది.

భవిష్యత్తులో అందరికీ ఉపయోగం



ఈ-శ్రమ్ పథకంలో ప్రతి ఒక్కరూ నమోదు చేయించుకోవడం వలన భవిష్యత్తులో ప్రయోజనాలు అధికంగా ఉంటాయి. ఈ-శ్రమ్ నమోదు పూర్తిగా ఉచితం. కార్మికులకు కలిగే ప్రయోజనాలను వివరిస్తున్నాం.

– కాశి శివనాగమల్లేశ్వరరావు, అసిస్టెంట్ లేబర్ ఆఫీసర్, మండపేట

లక్ష్యాన్ని చేరుకుంటాం



ఈ-శ్రమ్ నమోదు నమోదు ఇప్పటి వరకు 92శాతం నమోదును పూర్తి చేశాం. ఈ-శ్రమ్ నమోదుకు కార్మికులు అధికంగా ఉన్న ప్రాంతాలకు వెళ్లి అవగాహన కల్పిస్తున్నాం. నమోదు ప్రక్రియ పూర్తిగా ఉచితం కావడంతో కార్మికుల నుంచి స్పందన వస్తుంది.

– ఎ.విజయప్రకాష్, అసిస్టెంట్ లేబర్ ఆఫీసర్, రామచంద్రపురం

రిలే దీక్షకు తరలిరండి



ఎమ్మెల్సీ తోట త్రిమూర్తులు

కపిలేశ్వరపురం (మండపేట): ధాన్యాన్ని పూర్తి స్థాయిలో ప్రభుత్వమే కొనుగోలు చేయాలంటూ జిల్లా కేంద్రం అమలాపురంలో బుధవారం నిర్వహించ తలపెట్టిన నిరసన కార్యక్రమానికి మండపేట నియోజకవర్గం నుంచి పెద్ద ఎత్తున రైతులు, వైఎస్సార్ సీపీ నాయకులు, కార్యకర్తలు తరలి రావాలని ఎమ్మెల్సీ తోట త్రిమూర్తులు కోరారు. ప్రతి గింజనూ కొనే బాధ్యత నుంచి కూటమి ప్రభుత్వం తప్పుకొంటుందన్నారు. రైతుకు బాసటగా ప్రతి వైఎస్సార్ సీపీ కార్యకర్త నిలవాలన్నారు. అమలాపురంలోని ఆందోళనలో పాల్గొని రైతు సమస్య పరిష్కారానికై ప్రభుత్వంపై ఒత్తిడి పెంచాలన్నారు. నియోజకవర్గంలోని జెడ్పీటీసీలు పుట్టపూడి అబ్బు, కుడుపూడి భవాని, నల్లమిల్లి మంగాతాయారు, ఎంపీపీలు నౌండ్రు వెంకటరమణ, ఉండమట్ల శ్రీనివాస్, మేడిశెట్టి సత్యవేణిలు నిరసన కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కోరారు.

నేడు వాసవీ కన్యకాపరమేశ్వరి జన్మదినం

కపిలేశ్వరపురం: ఆర్యవైశ్య సామాజిక వర్గీయులు విశేషంగా ఆరాధించే వాసవీ కన్యకా పరమేశ్వరి జన్మదినం పూజలను నేడు మండపేటలోని అమ్మవారి ఆలయంలో బుధవారం నిర్వహించనున్నట్టు నిర్వాహకులు మంగళవారం తెలిపారు. ఆలయంలో పూజలు అనంతరం పట్టణంలో ఊరేగింపు నిర్వహిస్తామన్నారు.

మానసిక వికాసంతో మంచి భవిష్యత్



మండపేట అర్బన్ పీహెచ్‌సీ వద్ద చిన్నారులు, కార్యకర్తల మానవహారం

కపిలేశ్వరపురం: కౌమార దశలో చిన్నారులు మానసిక వికాసంతో వ్యవహరించడం ద్వారా వారికి మంచి భవిష్యత్ రూపుదిద్దుకొంటుందని ఐసీడీఎస్ మండపేట ప్రాజెక్టు సీడీపీఓ అధికారి గజలక్ష్మి అన్నారు. మండపేట, రాయవరం, కపిలేశ్వరపురం మండలాల్లోని పలు గ్రామాల్లో మంగళవారం కిశోరి వికాసం-2లో భాగంగా ప్రత్యేక కార్యక్రమాలను నిర్వహించారు. కపిలేశ్వరపురం మండలం వెదురుమూడిలోని అంగన్‌వాడీ కేంద్రంలో సూపర్‌వైజర్ పి.వెంకటలక్ష్మి మాట్లాడారు. అంగన్‌వాడీ ఎం.జానకిదేవీ, బి.నాగమణి, మహిళా పోలీస్ జి.ప్రమీల, ఎన్‌జీవో రమణయ్య, దుర్గాప్రసాద్, ఆశ, వైద్య, ఆరోగ్య కార్యకర్తలు పాల్గొన్నారు.

మండపేటలో...

మండపేట పట్టణంలోని హరిజన అర్బన్ పీహెచ్‌సీ, గొల్లపుంతలోని అర్బన్ పీహెచ్‌సీల్లో చిన్నారులు, వైద్య ఆరోగ్య, ఆశ, అంగన్‌వాడీ కార్యకర్తలు మానవహారం నిర్వహించారు. సీడీపీఓ గజలక్ష్మి మాట్లాడుతూ వైద్య, ఆరోగ్య, ఐసీడీఎస్, ఇతర ప్రభుత్వ శాఖల సంయుక్త ఆధ్వర్యంలో కిశోరి బాలికల వికాసం కోసం ప్రత్యేక కార్యక్రమాలను చేపడుతున్నామన్నారు. కార్యక్రమం లక్ష్యాన్ని ఐసీడీఎస్ సూపర్వైజర్లు సీహెచ్ శ్రీదేవి, పి.సునీత, సింహాచలం వివరించారు. వక్తలు మాట్లాడుతూ 11–18 సంవత్సరాల కిశోర బాలికలను 20 మందితో ఒక సమూహంగా ఏర్పాటు చేసి అవగాహన కల్పిస్తామన్నారు.




రాయవరంలో కిశోరి బాలికలతో అంగన్‌వాడీ సూపర్‌వైజర్, కార్యకర్తలు

కిశోరి వికాసంపై అవగాహన

రాయవరం: మండలంలోని రాయవరం సచివాలయం-1 పరిధిలో మంగళశారం కిశోరి వికాసంపై అవగాహన కల్పించారు. అంగన్‌వాడీ సూపర్‌వైజర్ పి.సునీత ఆధ్వర్యంలో హెల్త్ ఎడ్యుకేటర్ సరోజని అవగాహన కల్పించారు. కౌమారదశలో కిశోరి బాలికల్లో కలిగే మార్పులు, రక్తహీనత, లింగ వివక్షత, లైంగిక విద్య తదితర వివరాలపై అవగాహన కల్పించారు. సూపర్‌వైజర్ సునీత మాట్లాడుతూ కౌమార దశలో తీసుకున్న నిర్ణయాలతో భవిష్యత్తు, భావితరం ఉజ్వలంగా ఉంటుందన్నారు. కార్యక్రమంలో మహిళా కార్యదర్శులు లక్ష్మి, సురేఖలు బాల్య వివాహాలు, చట్టాలను వివరించారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ కార్యకర్తలు, ఆశ, కిశోరి బాలికలు పాల్గొన్నారు.

ధాన్యాన్ని ఇలా భద్రపరచుకోండి



రహదారిపై ఆరబెట్టిన ధాన్యం

కపిలేశ్వరపురం: ఆరుగాలం శ్రమించి పండించిన పంట తక్కువ ధర పలుకుతోంటే రైతుకు తీవ్రమైన అసహనం కలుగుతోంది. ప్రభుత్వం నుంచి పెట్టుబడి సాయం అందకపోయినా అప్పో సప్పో చేసి రైతు తన సాగు లక్ష్యాన్ని పూర్తి చేశాడు. ధాన్యాన్ని అమ్ముదామని రైతు సేవా కేంద్రానికి వెళ్తే తమ కేంద్రం సేకరణ లక్ష్యం పూర్తయిందంటూ వెనక్కి పంపేయడంతో రైతు దిక్కుతోచని స్థితిలోకి వెళ్లాడు. ప్రతి గ్రామంలోనూ క్షేత్ర స్థాయిలో రైతులు గగ్గోలు పెడుతున్నారు. జిల్లా అధికారులు స్పందించి జిల్లాకు మరో లక్ష టన్నుల ధాన్యాన్ని సేకరించేందుకు అవకాశం ఇచ్చినట్టు మంగళవారం ప్రకటించారు. ప్రతి గింజనూ కొనాల్సిన బాధ్యత నుంచి ప్రభుత్వం తప్పుకొంటూ రైతులకు కొనుగోలు ఆఫర్లు పెట్టినట్టు మరో లక్ష కొంటామంటూ ప్రకటనలు చేయడం వెనుక ప్రభుత్వ తీరును రైతులు ఖండిస్తున్నారు. ఇదిలా ఉండగా క్షేత్ర స్థాయిలో గిట్టుబాటు ధర అమలు కావడం లేదు. మరో పక్క కొంటామన్న మాట ఏ మేరకు అమలవుతుందే తెలీదు. మరో పక్క వాతావరణం తరచూ ముసురు కమ్ముకొంటోంది. పద్మవ్యూహంలో చిక్కుకున్నట్టు ఉంది రైతు పరిస్థితి. ఏది ఏమైనా ధాన్యాన్ని కొద్ది రోజులు పాటు దాచుకోవాల్సిన అనివార్య పరిస్థితిలోకి రైతు నెట్టబడ్డాడు. ధాన్యాన్ని శాస్త్రీయమైన పద్ధతిలో దాచుకునే పద్ధతులపై రైతుకు అవగాహన అవసరం కపిలేశ్వరపురం మండల వ్యవసాయాధికారి కేవీఎస్ రమేష్‌కుమార్ చేస్తోన్న సూచనలిలా ఉన్నాయి.

పాటించాల్సిన జాగ్రత్తలు

ధాన్యాన్ని నిల్వ చేసే గోదాము లోపల చెత్తా చెదారం లేకుండా శుభ్రం చేయాలి. గోదాము గోడలు, ఫ్లోర్‌లలో నెరలు ఉంటే పూడ్చేయాలి. కిటికీలు, వెంటిలేటర్ల నుంచి పక్షులు జొరబడకుండా బరకాలతో కప్పుకోవాలి. ధాన్యం నిల్వకు కొత్త గోనె సంచులను ఉపయోగించాలి. ఎలుకలు చొరబడకుండా రెండు అడుగులు ఎత్తు గల మెట్లలా పునాదులు నిర్మించాలి. గోడలు, నేల నుంచి బస్తాలకు తేమ తగలకుండా వాటిని గోడలకు దూరంగా చెక్క దిమ్మలు, లేదా చెక్క బల్లలపైన మెట్లు వేయాలి. ధాన్యం వేసే ముందు సంచుల మీద, లోపల మలాథియాన్ ద్రావణాన్ని పిచికారీ చేసి వాటిని మర్నాడు ఎండలో ఆరబెట్టి తేమ శాతం 13 లేదా అంతకంటే తక్కువగా ఉండేలా చూడాలి. ధాన్యంపైన ఎప్పుడూ నేరుగా పురుగు మందును చల్లరాదు. అప్పుడప్పుడు మలాథియాన్ ద్రావణాన్ని 1:100 నిష్పత్తిలో బస్తాల మీద, గోడల మీద పిచికారీ చేస్తూ ఉండాలి. నిల్వ ధాన్యంలో ఏమైనా కీటకాలు ఉన్నట్టయితే వాటి నివారణకు గోదాముల్లోకి గాలి వెళ్లకుండా చేసి అల్యూమినియం ఫాస్ఫైడ్ బిళ్ళల ద్వారా ఊదరబెట్టి నివారించవచ్చు. టన్ను ధాన్యానికి 3.0 గ్రాముల బిళ్లల రెండు నుంచి మూడు చొప్పున వాడాలి. గోదాములోకి గాలి ప్రవేశించకుండా కనీసం వారం రోజులు పాటు తలుపులు మూసి ఉంచితే మంచిది. ఎలుకల నివారణకు బోనులతో పాటు జింక్ ఫ్పైడ్ లేదా బ్రోమోడయోలిన్ వంటి మందుతో విషపు ఎరలు తయారు చేసి ఉపయోగించాలి.

8న పార్వతీ భీమేశ్వర స్వామివారి కల్యాణం

సఖినేటిపల్లి: మండలంలో కొలువైన పార్వతీ భీమేశ్వరస్వామి వారి వార్షిక కల్యాణం ఈ నెల 8న నిర్వహణకు అన్ని ఏర్పాట్లు చేసినట్టు ఆలయ ఉత్సవ కమిటీ, రుద్రరాజు రామలింగరాజు ఫ్యామిలీ ట్రస్టు మంగళవారం తెలిపింది. శైవాగమ పండితుడు బ్రహ్మశ్రీ పూజ్యం విశ్వనాథ శర్మ బ్రహ్మత్వంలో అర్చకులు పర్యవేక్షణలో గ్రామానికి చెందిన రుద్రరాజు రఘురామ కృష్ణంరాజు, శ్రీదేవి దంపతులతో కల్యాణం నిర్వహించనున్నట్టు కమిటీ వెల్లడించింది. కాగా అదే రోజు రాత్రి అన్నసమారాధన ఏర్పాటు చేసినట్టు కూడా ఆలయ కమిటీ తెలిపింది.

ఎంఎల్‌హెచ్‌పీ, ఈహెచ్‌ఓలపై చర్యలు తీసుకోవాలి



గొల్లపాలెం వైద్యాధికారులకు వినతిపత్రం సమర్పిస్తున్న ఏఎన్ఎం, హెల్త్ సూపర్‌వైజర్లు

కాజులూరు: వైద్య, ఆరోగ్య శాఖలో మూలస్తంభాలుగా ఉన్న ఏఎన్ఎం, హెల్త్ సూపర్‌వైజర్లపై అనుచిత వ్యాఖ్యలు చేసిన ఎంఎల్‌హెచ్‌పీ, ఈహెచ్‌ఓలపై ప్రభుత్వం శాఖా పరమైన చర్యలు తీసుకోవాలని గొల్లపాలెం పీహెచ్‌సీ ఎదుట ఏఎన్ఎం, హెల్త్ సూపర్‌వైజర్లు మంగళవారం ఆందోళన చేపట్టారు. ఉమెన్ హెల్త్ ఎంప్లాయీస్ అసోసియేషన్ ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో పలువురఏఎన్ఎంలు మాట్లాడుతూ ఏబీసీడీలు కుడా రాని వారికి ప్రభుత్వం పెద్దమొత్తంలో జీతాలు ఇస్తుందంటూ ఎంఎల్‌హెచ్‌పీ, ఈహెచ్‌ఓలు ఏఎన్ఎం, హెల్త్ సూపర్‌వైజర్లపై అనుచిత వ్యాఖ్యలు చేయడం బాధాకరమన్నారు. తమపై ఆధారపడే ఎంఎల్‌హెచ్‌పీ, ఈహెచ్‌ఓలు ఉద్యోగాలు చేస్తున్నారన్నారు. తమ మనోభావాలను కించపరచిన వారిపై క్రమశిక్షణ చర్యలు తీసుకోవాలని కోరుతూ రాష్ట్ర వ్యాప్తంగా పీహెచ్‌సీల వద్ద ధర్నాలు నిర్వహించామని ప్రభుత్వం స్పందించకుంటే తమ ఆందోళనలు మరింత ఉధృతం చేస్తామన్నారు. కార్యక్రమంలో ఎం.లలిత, కె.గౌరీపార్వతి, బీవీ సుశీల, నరాళ రాజారావు, జి.రామలక్ష్మీ, ఎన్.పద్మ, డి.వైకుంఠరావు తదితరులు పాల్గొన్నారు.

శాస్త్రీయంగా సంపద కేంద్రాల నిర్వహణ



ద్వారపూడి కేంద్రం నిర్వహణను పరిశీలిస్తున్న డీపీఓ

కపిలేశ్వరపురం (మండపేట): గ్రామాల్లోని సాలిడ్ వేస్ట్ మేనేజ్‌మెంట్ ప్రాసెసింగ్ కేంద్రాలను శాస్త్రీయ పద్ధతిలో నిర్వహించాలని సంబంధిత అధికారులను జిల్లా పంచాయతీ అధికారి డి.శాంతలక్ష్మి ఆదేశించారు. మండపేట మండలం ద్వారపూడి, తాపేశ్వరం, ఏడిద గ్రామ పంచాయతీల పరిధిలోని సాలిడ్ వేస్ట్ మేనేజ్‌మెంట్ ప్రాసెసింగ్ కేంద్రాలను మంగళవారం ఆమె పరిశీలించారు. కేంద్రాల సమీప నివాసితులతో ఆమె మాట్లాడారు. సోమవారం నుంచి శుక్రవారం వరకూ తడి చెత్తను, శని, ఆదివారాల్లో పొడి చెత్తను వేరు చేసి హరిత రాయబారులకు అందించడం ద్వారా కేంద్రాల నిర్వహణకు దోహదపడే అంశాలను వివరించారు. చెత్తను నిర్దేశించిన పద్ధతిలో అందజేయడమనేది సామాజిక బాధ్యతగా నివాసితులు గుర్తించాలని శాంతలక్ష్మి సూచించారు. కార్యక్రమంలో ఐటీసీ సెంటర్ల సిబ్బంది, డిప్యూటీ ఎంపీడీఓ డి.శ్రీనివాస్, కార్యదర్శిలు ఏవీ రమణ, ఎస్‌వీ సుబ్బారావు, పి.శ్రీనివాస్, పంచాయతీల సిబ్బంది పాల్గొన్నారు.

బీసీలను మోసగిస్తే పుట్టగతులు ఉండవు



సమావేశంలో మాట్లాడుతున్న బీసీ నేతలు

కాజులూరు: బీసీ మహిళలను మోసగిస్తే ఏ ప్రభుత్వానికైనా పుట్టగతులు ఉండవని నియోజకవర్గ వైఎస్సార్ సీపీ బీసీ సెల్ కన్వీనర్ పితాని సుబ్రహ్మణ్యం అన్నారు. మంగళవారం గొల్లపాలెంలో మండల గ్రామాలకు చెందిన బీసీ సంఘ సభ్యులతో సమావేశంలో సుబ్రహ్మణ్యం మాట్లాడుతూ బీసీ మహిళలకు కుట్టుమెషీన్ల పంపిణీ పేరుతో కూటమి ప్రభుత్వ నాయకులు రూ.150 కోట్లు దోచుకునేందుకు పథకం రూపొందించారన్నారు. ఒక్కో మహిళ పేరున రూ.16 వేలు చొప్పున దోపిడీకి ప్రయత్నిస్తున్నారని మండలంలో 260 మందిని కుట్టుమెషీన్ల శిక్షణ, పంపిణీకి ఎంపిక చేయగా ఒక్క కాజులూరు మండలంలోనే సుమారు 41 లక్షా 60 వేలు ప్రభుత్వ ధనం పక్కదారి పడుతుందన్నారు. గతంలోనూ ఆదరణ పథకం కింద మెషీన్ల పంపిణీ పేరుతో చంద్రబాబు ప్రభుత్వం మహిళలను మోసం చేసిందన్నారు. కూటమి ప్రభుత్వ అవినీతి పాలనతో రాష్ట్ర వ్యాప్తంగా బీసీ మహిళలు తీవ్ర ఇబ్బందులకు గురౌతున్నారని బీసీ నేతలందరూ వారికి అండగా నిలవాలన్నారు. కార్యక్రమంలో మండల బీసీ సంఘం అధ్యక్షుడు చొల్లంగి రమణ, మండల సేవాదళ్ అధ్యక్షుడు పాలిక వీరబాబు, మండల అగ్నికుల క్షత్రియుల సంఘం అధ్యక్షుడు చింతా నవీన్, సంఘ సభ్యులు గుత్తుల లోవరాజు, గుత్తుల ఈశ్వరరావు, పెంకే దుర్గాప్రసాద్, సువ్వారి గోవిందు, దంగేటి వెంకన్న, తదితరులు పాల్గొన్నారు.

రైతులను ఆదుకోవడంలో ప్రభుత్వం విఫలం



గంగలకుర్రులో తడిసిన ధాన్యం పనలను పరిశీలిస్తున్న కో ఆర్డినేటర్ శ్రీనివాసరావు

మామిడికుదురు: రైతులను ఆదుకోవడంలో కూటమి ప్రభుత్వం దారుణంగా వైఫల్యం చెందిందని వైఎస్సార్ సీపీ పి.గన్నవరం నియోజవర్గం కో-ఆర్డినేటర్ గన్నవరపు శ్రీనివాసరావు, మాజీ ఎమ్మెల్యే పాముల రాజేశ్వరీదేవి ఆగ్రహం వ్యక్తం చేశారు. ఇటీవల కురిసిన భారీ వర్షాలకు మొగలికుదురులో తడిసిన ధాన్యం రాశులను మంగళవారం వైఎస్సార్ సీపీ బృందం పరిశీలించింది. తడిసిన ధాన్యాన్ని తక్షణం మద్దతు ధరకు కొనుగోలు చేసి రైతులను ఆదుకోవాలన్నారు. రైతుల నుంచి సకాలంలో ధాన్యం కొనుగోలు చేయకపోవడం వల్ల రైతులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. టార్గెట్లు అయిపోయాయని అధికారులు ధాన్యం కొనడం లేదని రైతులు శిరిగినీడి వెంకటేశ్వరరావు, గోనిపాటి రాజబాబు, గుబ్బల శ్రీను వాపోయారు. గతంలో ఈ పరిస్థితి లేదన్నారు. రైతులకు వైఎస్సార్ సీపీ అండగా ఉంటుందని కో-ఆర్డినేటర్ శ్రీనివాసరావు భరోసా ఇచ్చారు. కార్యక్రమంలో పార్టీ నేతలు కడి శ్రీను, కొప్పిశెట్టి హేమసుందర్, తోరం భాస్కర్, తులా గోపాలకృష్ణ, జక్కంపూడి వాసు, మట్టపర్తి శివ, నెల్లి దుర్గాప్రసాద్, కొల్లాబత్తుల మధువాసన్ తదితరులు పాల్గొన్నారు.

అంబాజీపేట/అయినవిల్లి/పి.గన్నవరం: ఆరుగాలం కష్టించి పండించిన పంటలకు రైతులు విక్రయించుకునేందుకు వీలు లేకుండా కూటమి ప్రభుత్వం కటింగ్ పెట్టడం సిగ్గుచేటని, వైఎస్సార్ సీపీ నియోజకవర్గ కో ఆర్డినేటర్ గన్నవరపు శ్రీనివాసరావు విమర్శించారు. రైతుల విషయంలో కూటమి ప్రభుత్వం నిర్లక్ష్య వైఖరి వీడాలని, వరి రైతులను తక్షణం ఆదుకోవాలని డిమాండ్ చేశారు. గంగలకుర్రు పెదగరువు వద్ద ఉన్న ఆరబెట్టిన ధాన్యాన్ని, వర్షాలకు తడిసిన వరి పనలను పార్టీ మండల శాఖ అధ్యక్షుడు విత్తనాల ఇంద్రశేఖర్ ఆధ్వర్యంలో కో ఆర్డినేటర్ శ్రీనివాసరావు పార్టీ నాయకులతో కలసి మంగళవారం పరిశీలించారు. రైతులు పితాని శ్రీనివాస్, విత్తనాల బాలరాజు, ఇళ్ల గోపిలు మాట్లాడుతూ రైతుల వద్ద ఉన్న ధాన్యంను కొనుగోలు చేసేందుకు పరిమితి అయిపోయిందని తాము కొనుగోలు చేయలేమని ప్రభుత్వం ఏర్పాటు చేసిన మిల్లర్లు చెబుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. దీనిపై కో ఆర్డినేటర్ శ్రీనివాసరావు మాట్లాడుతూ రైతులు పండించిన పంటలను కూటమి ప్రభుత్వం కొనుగోలు చేయకుండా పరిమితి అయిపోయిందని చేతులు దులుపుకోవడం సిగ్గుచేటన్నారు. రైతుల వద్ద ఉన్న ధాన్యాన్ని, తడిసిన ధాన్యంను కొనుగోలు చేయాలని నినాదాలు చేశారు. కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే పాముల రాజేశ్వరిదేవి, ఎంపీపీ దొమ్మేటి వెంకటేశ్వరరావు, జెడ్పీటీసీ బి.వరలక్ష్మి, సర్పంచ్ కె.శ్రీనివాసరావు, డి.సత్యమోహన్, ఎం.కిరణ్‌కుమార్, పేరి శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు. అలాగే పి.గన్నవరం మండలం రాజులపాలెం, అయినవిల్లి మండలం సిరిపల్లిలోనూ తడిసిన ధాన్యాన్ని పార్టీ మండల నాయకులతో కలసి కోఆర్డినేటర్ పరిశీలించారు.